క్లుప్తంగా

స్వామి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అంజనీ పుత్రుడు, రామభక్త వీర హనుమ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్వయంభూ మాచవరం శ్రీ దాసాంజనేయస్వామి ఆలయంలో గురువారం జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేసే అన్యాయాలను ఎదుర్కొనే బలం, ధైర్యం తమకు ప్రసాదించాలని, కూటమి నేతలకు సద్బుద్ధి ప్రసాదించాలని స్వామిని కోరానన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు.

బహుముఖ ప్రతిభాశాలి వేటూరి



విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి వేటూరి సుందరరామమూర్తి అని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ కొనియాడారు. గీతాంజలి మ్యూజిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మపల్లిలోని వేటూరి విగ్రహంవద్ద 15 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. తెలుగు సినిమా పాటకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఘనత వేటూరికే దక్కిందన్నారు. వేటూరి పాటల పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ.. వేటూరి పాటల రచనాశైలి వైవిధ్యంగా ఉంటుందన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, సింగంశెట్టి చంద్రశేఖర్, ప్రభల శ్రీనివాస్, నరసింహారావు, చిట్టిబాబు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

దాసాంజనేయ ఆలయానికి రూ.5.82 లక్షల విరాళం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీదాసాంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి గురువారం తుమ్మల వెంకట రాజేష్ రూ.5.82 లక్షల విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. మహిమాన్వితమైన దాసాంజనేయ స్వామి ఆలయం అభివృద్ధికి తన వంతు బాధ్యతగా విరాళం ఇచ్చానన్నారు. హనుమజ్జయంతి రోజు విరాళం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రంతో దాతను సత్కరించారు.

శ్రీరామ దూతం శిరసా నమామి

- భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు
- కిటకిటలాడిన దేవాలయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్దకు భక్తులు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మాచవరం శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి స్వామికి విశేషంగా ఆకుపూజలు, సిందూర అర్చనలు జరిగాయి. స్వామిని దర్శించుకుని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు స్వామిని దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈఓ పాతూరి లోకేశ్వరి, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సతీష్ పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

బుడమేరు వంతెన సెంటర్‌లో..

బుడమేరు వంతెన సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం, రామకృష్ణాపురంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణి మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.చంద్రమౌళి, ఎస్.దుర్గారావు, కృష్ణ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో..

ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, యాదల శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు. శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో శ్రీధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. స్వామికి ప్రత్యేక పూజలు, నాగవల్లి దళాలతో అర్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పూజలను పర్యవేక్షించారు. ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో ఆంజనేయ స్వామికి సిందూరం, తమలపాకులతో అర్చనలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు డి.వి.ఎస్. రాజు పర్యవేక్షించారు. మధురానగర్ శ్రీకల్యాణ రామాలయంలో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. 108 మామిడి పండ్లతో అలంకారం చేసి 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.



బుడమేరు వంతెన వద్ద అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న మల్లాది విష్ణు



బాబా మందిరంలో పూజలు చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

లెనిన్ సెంటర్..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీ నాగసాయిబాబ, నాగమానసాదేవి ఆలయంలో గురువారం హనుమత్‌జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు రోజంతా ఉపవాస దీక్ష చేపట్టి ఆంజనేయుడితోపాటు సీతారామచంద్రులను పూజించారు. హనుమాన్ చాలీసా పారాయణం, సుందరకాండ పఠనం, రామనామ జపం చేశారు. రకరకాల పూలు, లక్ష తమలపాకులతో స్వామి వారిని ఆరాధించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించారు.

ప్రకాష్‌నగర్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ చేశారు.



తమలపాకులతో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



దాసాంజనేయస్వామి ఆలయంలో మంత్రి అచ్చన్నాయుడు, ఎమ్మెల్యే బోండా ఉమా



మధురానగర్ శ్రీకల్యాణ రామాలయంలో స్వామివారు



ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..



మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో స్వామివారు

పాలస్తీనాకు ప్రపంచ దేశాలు అండగా నిలవాలి



పాలస్తీనా ముఖచిత్రం పుస్తకాన్ని ఆవిష్కరించిన బుడ్డిగ జమీందార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇజ్రాయిల్ దురాక్రమణకు, వివక్షకు గురైై ప్రపంచ దేశాల మద్దతు ఆశించిన స్థాయిలో అందని పాలస్తీనాకు యావత్ ప్రపంచం మానవత్వంతో అండగా నిలవాలని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యుడు బుడ్డిగ జమీందార్ పిలుపునిచ్చారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో రైతు కూలీ సంఘం (ఏపీ) ఆధ్వర్యంలో 'పాలస్తీనా ముఖచిత్రం' పుస్తకావిష్కరణ గురువారం జరిగింది. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి యు.వీరబాబు అధ్యక్షతన జరిగిన సభలో బుడ్డిగ జమీందార్ మాట్లాడుతూ.. పాలస్తీనా ప్రజలు సొంత దేశంలోనే కాందిశీకులుగా జీవిస్తున్నారన్నారు. అమెరికా అండదండలతో, సామ్రాజ్యవాద దేశాల కనుసన్నల్లోనే పాలస్తీనాను ఇజ్రాయిల్ నాశనం చేసిందన్నారు. పశ్చిమ ఆసియా దేశాల్లో పట్టు కోసం, సహజ వనరులు, సంపదను దోచుకునేందుకే ఇజ్రాయిల్‌ను అమెరికా పెంచి పోషించిందన్నారు. పాలస్తీనా పుస్తకాన్ని విశ్లేషించారు. జనసాహితీ అధ్యక్షుడు దివి కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచాన్ని శాసించే, యుద్ధాలను సృష్టించి, కనుసైగతో నిలుపుదల చేసే అమెరికా ఇజ్రాయిల్ దాడులను ఎందుకు నియంత్రించడం లేదని ప్రశ్నించారు. ఐక్యరాజ్య సమితి, ప్రపంచ న్యాయస్థానాలు, అరబ్ దేశాలు ఇజ్రాయెల్ దాడులను ఖండించిన, వ్యతిరేకించినా నేటికీ దురాక్రమణ, దాడులు కొనసాగడానికి అమెరికా ప్రోద్బలమే కారణమన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ.. పాలస్తీనా భూభాగాన్ని, సహజ వనరులు, సంపదను కొల్లగొట్టి కేవలం పది శాతం భూభాగంలో కూడా ప్రజలు జీవించకుండా ఇజ్రాయిల్ నిత్యం దాడులు, హింసకు గురి చేస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఆలిండియా కిసాన్ సంఘటన్ రాష్ట్ర కన్వీనర్ మరీదు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. పాలస్తీనాకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎం.రాంబాబు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ద్వీపం పూర్వ వైభవానికి ప్రణాళికలు సిద్ధం

రెండు దశల్లో రూ.3.89 కోట్లు మంజూరు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు చెందిన భవానీ ద్వీపాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, సీఈఓ హిమాన్షు శుక్లా చొరవతో భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) నుంచి నిధులు మంజూరయ్యాయి. మొదటి దశకు రూ.2.65 కోట్లు, రెండో దశకు రూ.1.24 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో వరదలు వచ్చినప్పుడు దాని ఉధృతికి ద్వీపం వెంబడి నదీ తీరం కొట్టుకుపోకుండా ద్వీపంలోని ఐకాన్ టవర్‌కు మరమ్మతులు చేయటంతో పాటు దాని చుట్టూ, జట్టీ ఏరియాలో కూడా సుమారు 150 మీటర్ల ఎత్తులో స్టీల్ షీట్ ఫైలింగ్ చేయనున్నారు. ఐకాన్ టవర్, జట్టీ చుట్టూ ఇసుక బస్తాలతో ఫిల్లింగ్ చేస్తారు. ఇటీవల సంభవించిన వరద తాకిడికి ధ్వంసమయిన ద్వీపంలోని గేమింగ్ జోన్ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. మేజ్ గార్డెన్‌కు మరమ్మతులు చేపట్టి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ద్వీపంలో గల పాత్‌వే పక్కన ఉన్న ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైటింగ్ (వరదల్లో దెబ్బతిన్నవి)ను పునరుద్ధరిస్తారు. ముఖ్యంగా ద్వీపానికి అందాన్నిచ్చే ల్యాండ్ స్కేపింగ్ మొన్న వరదల్లో పాడైపోగా దానిని సరికొత్తగా తీర్చిదిద్దనున్నారు. వరద ఉధృతికి ధ్వంసమైన పాత్‌వేను సిమెంట్ కాంక్రీట్‌తో అభివృద్ధి చేయటం, పాత్‌వే పక్కన ఉండే బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తారు. రెండు దశల్లో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులన్నీ బీఐటీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఇంజినీరింగ్) ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో జరుగనున్నాయి.



పునరుద్ధరించనున్న పాత్‌వే

కూటమి పాలనలో ఆలయాలకు రక్షణ కరువు

శైవ పీఠాధిపతి శివస్వామి

విజయవాడ కల్చరల్: కూటమి ప్రభుత్వంలో హిందూ ఆలయాలకు, వాటి ఆస్తులకు రక్షణలేకుండా పోయిందని శైవ పీఠాధిపతి శివస్వామి పేర్కొన్నారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. విశ్వహిందూ పరిషత్ మహానగర్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌టీఎస్ రోడ్డులో హనుమత్ జయంతి సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ.. హనుమత్ జయంతిని విజయ్ దివస్‌గా భావించాలని శైవ పీఠాధిపతి శివస్వామి సూచించారు. హనుమంతుడిలోని కార్యదీక్షను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. మాతా శివానంద సరస్వతి మాట్లాడుతూ.. సర్వహిందువులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ రామ మందిరాలను నిర్మించాలన్నారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు సుబ్బరాజు, పుట్టగుంట సతీష్, నగరశాఖ అధ్యక్షుడు సానా శ్రీనివాస్, కార్యదర్శి క్రోవి రామకృష్ణ, కోశాధికారి పేర్ల రవీంద్రగుప్తా, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరారవు, బీజేపీ నాయకులు నాగలింగం శివాజీ, తూములూరి చైతన్య శర్మ పాల్గొన్నారు.

శోభాయమానంగా బైక్ ర్యాలీ

నగరంలోని పాత బస్తీ, సింగ్‌నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కృష్ణలంక, పాయకాపురం తదితర ప్రాంతాల నుంచి హనుమాన్ భక్తులు ర్యాలీగా బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఆదిశంకర సర్కిల్‌కు చేరుకున్నారు. అనంతరం బైక్ ర్యాలీ శోభాయమానంగా సాగింది. మహిళలు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో ఆకర్షణగా నిలిచిన అభయాంజనేయ స్వామి విగ్రహం



బైక్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు

తటాకాలను తలపిస్తున్న రోడ్లు

- రోడ్లపై మోకాలి లోతు గుంతలు
- రోడ్లపై రోజులతబడి నిలుస్తున్న వర్షపు నీరు
- వర్షాకాలం ముంచుకొస్తున్నా స్పందించని అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వర్షం పడిందంటే చాలు నగరవాసులు వణికిపోతున్నారు. ప్రధాన రహదారులు వర్షపు నీటితో నిండి తటాకాలను తలపిస్తున్నాయి. రోడ్లకు వేసిన తారు కొట్టుకుపోయి మోకాలి లోతు గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతల కారణంగా ఆ రోడ్లపై వాహనాలు ఉయ్యాలలూగుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక అంతర్గత రోడ్ల పరిస్థితి చెప్పనవసరం లేదు. వర్షకాలంలో తంతు ఇలా ఉంటే అధికారులు మాత్రం కనీసం స్పందించడం లేదు.

అమరావతి నగరానికి ముఖ ద్వారం అని చెప్పుకొనే విజయవాడ ప్రధాన రహదారులు కొద్దిపాటి వర్షానికి జలమయం అవుతున్నాయి. ఓ మోస్తరు వర్షం కురిస్తే రోడ్డుపైకి వెళ్లే పరిస్థితి లేదు. నగరంతోపాటు సమీపంలోని గ్రామాల్లో ప్రధాన రహదారుల పరిస్థితి ఇంచుమించు అంతే. వర్షాలకు రోడ్డుపై వర్షపు నిలిచి గోతులు ఏర్పడుతున్నాయి. వాహనాల రాకపోకలతో అవి కాస్తా మోకాలి లోతు గుంతలుగా మారుతున్నాయి. ఎండాకాలంలో కురుస్తున్న అకాల వర్షాలకే పరిస్థితి ఇలా ఉంటే, ఇక వర్షకాలం పరిస్థితి ఏమిటని నగర వాసులు కలత చెందుతున్నారు.


- హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై గొల్లపూడి మైలురాయి సెంటర్ నుంచి సారంగం వైపు వెళ్లే ప్రధాన రహదారి వర్షపు నీరు నిలిచి అధ్వానంగా మారింది. మైలురాయి సమీపంలోని డ్వామా కార్యాలయం ఎదురుగా రోడ్డు చెరువును తలపిస్తోంది. ఇక్కడ అసలు డ్రెయినేజీ లేదు. మార్జిన్లు ఎత్తు కావడం, రోడ్డు పల్లంలో ఉండడంతో వర్షం కురిసిన తర్వాత వారం రోజుల వరకు కూడా నీరు పోవడం లేదు. ఫలితంగా తారు కొట్టుకుపోయి పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.
- అదే రోడ్డులో బీసీ భవన్ వద్ద వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయింది. బీసీ భవన్‌లోకి వెళ్లేందుకు మార్గం లేదు. 59 కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు నిత్యం తిరిగే ఈ ప్రాంతంలో ప్రధాన రహదారికి పక్కా డ్రెయినే లేదు. కచ్చా డ్రెయిన్ మాత్రమే ఉంది.
- భవానీపురం – గొల్లపూడి మధ్య ఎట్కిన్ సన్ రోడ్డులో మార్జిన్లు ఎత్తుగా మారి డ్రెయిన్‌లోకి వర్షపు నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో రోడ్డు పైకి వర్షపు నీరు చేరింది.
- విద్యాధరపురం ఆర్టీసీ డిపో కొద్దిపాటి వర్షానికి జలమయమవుతోంది. బస్సులు వర్షపు నీటిలోనే ఉన్నాయి. విధులకు హాజరయ్యే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. డిపోలో వర్షపు నీరు ఇంకిపోయిన రోజే లేదు.
- కుమ్మరిపాలెం సెంటర్, ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు, చెరువు సెంటర్‌లోవర్షపు నీరు చేరి స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు.
- పండింట్ నెహ్రూ బస్టాండ్ నుంచి కనకదుర్గ ఫ్లై ఓవర్ వైపు వచ్చే మార్గంలో రైల్వే వంతెనక కింద భాగంలో తరచూ వర్షపు నీరు నిలిచ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ భారీగా స్తంభించిపోతోంది.
- బందరు రోడ్డులో బెంజ్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ ఆపై వరకు వర్షపు నీరు నిలిచి ప్రజలు అసౌకర్యానికి గురువుతున్నారు.
- ఐదో నంబర్‌రోడ్డులో పాత పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, కరెన్సీ నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో వర్షకాలం రోడ్ల పరస్థితి అధ్వానంగా తయారవుతోంది.
- ఏలూరు రోడ్డులో కొత్త వంతెన సెంటర్ నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, విశాలాంధ్ర రోడ్డులో భారీగా వర్షపు నీరు చేరుతోంది.
- కండ్రిక జంక్షన్, కండ్రిక కాలనీలో కొద్దిపాటి వర్షాలకు రోడ్లపై నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు.
- ప్రతి వర్షాకాలంలో ఈ పరిస్థితి ఉంటున్నప్పటికీ అధికారులు వర్షపు నీరు నిల్వకుండా చేపట్టాల్సిన చర్యలు చేపట్టడం లేదు. ముందస్తు ప్రణాళికలు రచించి వర్షపు నీరు వెళ్లేలా అవసరమైన పనులు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వర్షకాలం ముంచుకొస్తున్న తరుణంలో అధికారులు స్పందించి ఎక్కడెక్కడ వర్షపు నీరు నిలుస్తుందో కారణాలు అన్వేషించి పరిష్కారం చూపాలని నగరవాసులు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న విద్యాధరపురం ఆర్టీసీ డిపో ప్రాంగణం







బీసీ భవన్ ఎదురుగా రోడ్డుపై వర్షపు నీరు : మైలు రాయి సెంటర్‌లో డ్వామా కార్యాలయానికి ఎదురుగా అధ్వానంగా రోడ్డు : ఏసీబీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

ఆకట్టుకున్న హరికథాగానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు మారుతీ వ్యాయామశాల ప్రాంగణంలోని శ్రీ అభయాంజనేయస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం గుడిపాటి సుధాకర్ భాగవతార్ హనుమత్సందేశంపై చేసిన హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. సుధాకర్ భాగవతార్ హనుమంతుని సందేశాన్ని ఆయన జీవిత వృత్తాంతాన్ని అందరికీ అర్థమయ్యేరీతిలో వివరించారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలుతో ఊరేగింపు జరిగింది. కార్యక్రమాలను శిష్టా హనుమంతుప్రసాద్ పర్యవేక్షించారు.

రేషన్ వాహనాల నిలిపివేత తగదు

వించిపేట(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా లబ్ధిదారుల ఇళ్లకే రేషన్ పంపిణీ చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని, కాని ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రేషన్ సరఫరా చేసే వాహనాలను నిలిపేస్తూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ప్రకటించిన సన్న బియ్యం అటక ఎక్కించారని, ఏడాదిలోనే లక్షా డెబ్బై వేల కోట్లు అప్పుచేసినా ఇంకా సూపర్ సిక్స్ పథకాల ఊసే లేదని విమర్శించారు. మరోవైపు మద్యాన్ని మాత్రం 24 గంటలు సరఫరా చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని ధ్వజమెత్తారు.

- చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఉరుములు, పిడుగుపాటు సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి, కనీస జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చునని కొత్తపేట అగ్నిమాపక కేంద్ర అధికారి టి.శ్రీనివాసరావు సూచించారు. కలరా హాస్పిటల్, సర్కిల్-1 కార్యాలయ సిబ్బందికి పిడుగుపాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు.